


బుధవారం 7 అక్టోబర్ 2026 పేజీలు : 8

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీ నామా చేయాలి



# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నిజమైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 6 ,( ప్రజాజ్యోతి )**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, నిజమైన అర్హులకే ప్రభుత్వ ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు.మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.



## పాఠశాల గోడలకు పగుళ్లు..

## విద్యార్థుల ప్రాణాలకు ముప్పు!

- ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయం.. భయం!
- శిథిలావస్థకు చేరిన జెడ్పీహెచ్ఎస్ తరగతి గదులు
- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు.. తల్లిదండ్రుల్లోనూ భయాందోళన
- ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి

## 2 కోట్ల 25 లక్షల చొప్పున ఖానాపూర్, కడం తాసిల్దార్ భవనాలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



# చిన్నారుల నెత్తిన పెచ్చుల ముప్పు!

- భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కూలిన స్లాబ్ పెచ్చులు
- ముగ్గురు చిన్నారులు.. ఇద్దరు మహిళలకు గాయాలు
- పరుగులు తీసిన పిల్లలు.. తప్పిన పెను ప్రమాదం
- తేలివాడ అంగన్వాడీలో కలకలం



# 2 కోట్ల 25 లక్షల చొప్పున ఖానాపూర్, కదం తాసిల్దార్ భవనాలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి

**ఖానాపూర్ అక్టోబర్ 6( ప్రజా జ్యోతి )**ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఖానాపూర్, కదం, మండల కేంద్రాల్లో తహసిల్దార్ భవనాలతో పాటు దస్తురాబాద్ మండలాల్లోనూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఇద్దరు మంత్రుల సమక్షంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చేశారు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి పనులకు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శంకుస్థాపన చేశారు.ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా కడెం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ భవనానికి రూ.2.25 కోట్లు, ఖానాపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ భవనానికి రూ.2.25 కోట్లు, ఖానాపూర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి రూ.1.40 కోట్లు మంజూరు కాగా, దస్తురాబాద్ మండలం గోడ్సెరియాల్‌లో పీహెచ్‌సీ సబ్



సెంటర్‌తో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, మంజూరైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలకు ఏలేటి అశ్విన్ రెడ్డికి ఆహ్వానం

**నేరడిగొండ, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి):** మండలంలోని కుమారి గ్రామంలో నిర్వహించనున్న శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఆదిలాబాద్ జిల్లా పిఏసి మెంబర్ ఏలేటి అశ్విన్ రెడ్డికి గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ... ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు. దుర్గామాత దివ్య ఆశీస్సులు బోథ్ నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్, బోథ్ మండల వైస్ ప్రెసిడెంట్ నడికుంట ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్



కైలాష్ సింగ్, కుమారి గ్రామస్థులు పర్ల సాయన్న, భూమన్నలతో పాటు పలువురు యువకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# అర్హులైన దివ్యాంగులందరికీ సదరం పత్రాలు అందించాలి



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 6 ,( ప్రజాజ్యోతి )** అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువీకరణ పత్రాలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సదరం ధ్రువీకరణ పత్రాల జారీపై సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు నిర్వహించిన శిబిరాలు, జారీ చేసిన సదరం సర్టిఫికెట్లు, పెండింగ్ సంఖ్య, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు సదరం శిబిరాలు నిర్వహించి, అర్హులకు పారదర్శకంగా సదరం



పత్రాలు అందజేయాలన్నారు. దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను నిర్వహించాలన్నారు. సదరం శిబిరం వద్ద అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. వెయిటింగ్ లిస్టులో ఉన్న దివ్యాంగులకు శిబిరాల నిర్వహణ తేదీ, సమయం వివరాలు ముందుగానే అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ లో పామాయిల్ పరిశ్రమతో పాటు డిగ్రీ కళాశాల పాలిటెక్నిక్ కేంద్రం ఏర్పాటు చేస్తాం

సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి కేంద్రంలో





**ఖానాపూర్ అక్టోబర్ 6( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో గత అనేక దశాబ్దాల నుంచి జరగని అభివృద్ధిని చేసి చూపిస్తామని ఈ మేరకు మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ బవేష్ మిశ్రా ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జోపటేల్ అన్నారు ఖానాపూర్ మండల కేంద్రంలో ఆయిల్ ఫామ్ పరిశ్రమతో పాటు ఈ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు డిగ్రీ కళాశాల ఇప్పటికే మంజూరు అయినప్పటికీ ఆ స్థానంలో పాలిటెక్నిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు దీనికోసం త్వరలో సమీక్ష సమావేశాన్ని పార్టీల కతి తంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చర్చించి మరి అభివృద్ధి చేస్తామన్నారు కేకే రావు క్లబ్ స్థానంలో స్వర్గీయ అప్పటి మాజీ మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు జగన్నాథరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన స్థలంలో అధునాతంగా లైబ్రరీ ఏర్పాటు చేస్తామని అన్నారు అధికారులు ప్రజల వైపు ఉండి నిష్పక్షపాతంగా పనిచేయాలని ఎవరి ఒత్తడికి తాలోగ్గి ఎలాంటి చిన్న పొరపాట్లు జరిగిన సహించేది లేదని తమ మనుషులమంటూ తమ పార్టీ గానీ ఇతరులు చెప్పకున్నా తాము ఎవరి పక్షం కాదని ప్రజల పక్షంకే న్యాయపరంగా నిలబడతామని తెలిపారు ఖానాపూర్ లో కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ లో అనర్హులను ఇప్పటికే గుర్తించిన అధికారులు వారిని తొలగించేందుకు పునర్ సమీక్షించి ఎవరికి అన్యాయం జరగకుండా అర్హులకు మేలు కలిగే విధంగా వ్యవహరించి అనర్హులను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు తాను ఎన్నికైన తొలిదశలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరా స్థలం ఉందని ఖానాపూర్ లో ఉన్న గాని ఉట్నూరుకు తీసుకెళ్లారని ప్రతిపక్షాల ఆరోపణల్లో నిజం లేదని దాన్ని తేటతెల్లం చేయడానికి 110 ఎకరాల్లో సమగ్ర సర్వే నిర్వహించామన్నారు దీని కోసమే ఇంత టైం పట్టిందని వివరించారుతమని ఇరుకునపెట్టి ఇక్కడి కొందరు స్వార్థ రాజకీయ బడా నాయకులు గుప్పెట్లో పెట్టుకొని అధికారాన్ని గతంలో చేసిన విధంగా మార్చుకునే పరిస్థితిని తిప్పి కొట్టడంతో వారికి మింగుడు పడడం లేదని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బవేష్ మిశ్రా తో పాటు అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ ఆర్డిఓ దేవిదాస్ ఖానాపూర్ తాసిల్దార్ సుజాత రెడ్డి ఎంపీడీవో రాథోడ్ రాధా మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ విద్యుత్ ఏఈ రాంసింగ్ తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు

## విద్యుత్ సరఫరా మెరుగుపరచాలి

ఫెయిలైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలి

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



**ఆసిఫాబాద్, అక్టోబరు 6 ప్రజా జ్యోతి** విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరచడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కుమురం భీం ఆసిఫాబాద్ ఎస్ఈ ఉత్తమ్ జాడే అధికారులకు సూచించారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో సాంకేతిక, ఎంఆర్‌టీ, రెవెన్యూ, కమర్షియల్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా నాణ్యత, ఫీడర్ల పనితీరు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థితిగతులు, విద్యుత్ నష్టాలు, రెవెన్యూ వసూళ్లు, కమర్షియల్ అంశాలపై సమీక్షించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫెయిలైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు, సాంకేతిక సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్ఈ సూచించారు. సమావేశంలో డీఈఈలు, ఏడీఈలు, ఏఈలు, ఏఏఓలు, ఎంఆర్‌టీ, కమర్షియల్, టెక్నికల్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల గోడలకు పగుళ్లు.. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు!

ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయం.. భయం!

- శిథిలావస్థకు చేరిన జెడ్పీహెచ్ఎస్ తరగతి గదులు
- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు.. తల్లిదండ్రుల్లోనూ భయాందోళన
- ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి





**నేరడిగొండ, అక్టోబర్ 06 (ప్రజాజ్యోతి):** మండలంలోని కుమారి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) భవనం అధ్వాన స్థితికి చేరుకోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. పాఠశాలలోని పలు తరగతి గదుల గోడలకు పెద్దఎత్తున పగుళ్లు ఏర్పడటంతో భవనం ఎప్పుడు ఏ ప్రమాదానికి దారితీస్తుందోనన్న భయాందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొన్ని గదుల గోడలు, భవనంలోని ఇతర భాగాలు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇలాంటి గదుల్లోనే విద్యార్థులు కూర్చొని పాఠాలు వినాల్సి రావడం, ఉపాధ్యాయులు బోధించాల్సి రావడం ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు సైతం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితిపై సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకముందే ప్రమాదకరంగా ఉన్న గదులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైతే ప్రత్యామ్నాయ తరగతి గదులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఈ-వేస్ట్ సేకరణపై ప్రత్యేక డ్రైవ్....






స్వచ్ఛత పక్వాడాలో శ్రీరాంపూర్ ఏరియా ప్రథమ బహుమతే లక్ష్యం

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడాలో భాగంగా ఈ-వేస్ట్ డిస్పోజల్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు మినిస్ట్రీ ఆఫ్ కోల్ ప్రత్యేక ఆదేశాలతో సింగరేణి వ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా 'డిస్పోజల్ ఆఫ్ ఈ-వేస్ట్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఈ-వేస్ట్ కలెక్షన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మునిగంటి శ్రీనివాస్ ఏరియా అధికారులు, జీఎం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పనిచేయని, పాడైన కంప్యూటర్ విడిభాగాలు, కేబుల్స్, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కలెక్షన్ బాక్సుల్లో వేశారు. జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాల్లో వృథాగా ఉన్న కీబోర్డులు, మౌస్లు, కేబుల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అధికారులు, ఉద్యోగులు సేకరించి ఆయా బాక్సుల్లో జమ చేశారు. సేకరించిన ఈ-వేస్ట్‌ను పూర్తిస్థాయిలో డిస్పోజల్ చేసేలా సంబంధిత యూనిట్లకు తరలించనున్నారు. ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు నిర్వహించే స్వచ్ఛత పక్వాడాలో భాగంగా ఈసారి ఈ-వేస్ట్ డిస్పోజల్ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని ప్రతి విభాగం, వర్కింగ్ ప్లేస్, గదుల్లో వృథాగా ఉన్న పనిచేయని కంప్యూటర్లు, ఎలక్ట్రికల్ పరికరాలను గుర్తించి సేకరించి ప్రత్యేక బాక్సుల్లో వేయాలని సూచించారు. కేవలం జీఎం కార్యాలయానికే పరిమితం కాకుండా అన్ని విభాగాలు, గనుల్లోనూ ఈ-వేస్ట్‌ను పూర్తిస్థాయిలో డిస్పోజల్ చేసేలా కృషి చేయాలని కోరారు. స్వచ్ఛత పక్వాడాలో 2023లో శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వ్యాప్తంగా ప్రథమ బహుమతి సాధించగా, 2024, 2025 సంవత్సరాల్లో ద్వితీయ బహుమతి సాధించిందని జీఎం తెలిపారు. ఈసారి ప్రథమ బహుమతి సాధించేలా అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, సీఎంఓఏఐ ప్రతినిధి పద్మ, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి. రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) శ్రీధర్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్ మురళికృష్ణ యాదవ్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, ఏరియా సర్వే ఆఫీసర్ నర్సింగా రావు, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, డీవైపీఎం క్రాంతి కుమార్, ఇతర అధికారులు, జీఎం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## నిజమైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా







**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 6 ,( ప్రజాజ్యోతి )**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, నిజమైన అర్హులకే ప్రభుత్వ ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు.మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికే అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులను ఎంపిక చేసే ముందు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో పరిశీలన నిర్వహించి, అర్హతలను నిర్ధారించిన తర్వాతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, నిర్మాణ పనులు వేగంగా జరిగేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే భూ సంబంధిత సమస్యలను పరిశీలించి, అర్హత మేరకు పరిష్కరించాలని అన్నారు.మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందే ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకత పాటించాలని అన్నారు. ముఖ్యంగా స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని, అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, డీవైఎస్వో శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు సుజాత, ఖాజా మొయినుద్దీన్, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసైన్డ్ భూములపై అక్రమార్కులు కాజేసిన భూములపై ఆరుగురితో ప్రత్యేక కమిటీ చేవిచారణ

**అక్రమం అని తెలిస్తే ఎంతటి వారి కైనా శిక్ష తప్పదు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరిక**





**ఖానాపూర్ అక్టోబర్ 6(ప్రజా జ్యోతి)** ఖానాపూర్ కడెం మండలాలతో పాటు ఎక్కడైనా ప్రభుత్వ అసైన్డ్ భూములు అక్రమంగా స్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటున్న లేద ఆధీనంలో ఉంచుకున్న వ్యాపారం చేసుకుంటున్న భూములపై ఆరుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపిస్తున్నామని జిల్లా కలెక్టర్ బవేష్ మిశ్ర అన్నారు ఖానాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంగళవారం పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కడెం ఖానాపూర్ ఇతర అసైన్డ్ ప్రభుత్వ భూములపై సమగ్రంగా వివరించగా కలెక్టర్ స్పందించి అక్కడికక్కడే కమిటీని వేస్తున్నట్లు ప్రకటించారు వచ్చే నెల సమీక్ష సమావేశం లోపు అక్రమంగా అక్రమార్కుల భూములను స్వాధీనం చేసుకుంటామనిఅన్నారు అదే విధంగా ప్రభుత్వానికి సంబంధించిన ఒక్క ఇంచ్ భూమిని కూడా వదిలే సమస్య లేదని ఒకవేళ విచారణలో ఆక్రమించారని తెలిస్తే ఎంతటి వారినైనా శిక్షించక తప్పదని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు ఖానాపూర్ పట్టణంలోని 110 ఎకరాల్లో గల అక్రమాలతో పాటు డబుల్ బెడ్ రూమ్ అనర్హులు గుర్తిస్తామన్నారు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో కొంతమంది అసైన్డ్ భూములను ఆక్రమించుకోవడమే కాకుండా ప్రభుత్వం భూమిని సైతం కోర్టుకెక్కి ఆపుకోవడం ఇరిగేషన్ కు సంబంధించిన ఒక స్థలాన్ని తమదే నంటూ పనులు మధ్యలోనే నిలిపివేయడం లాంటి ఫిర్యాదులతో పాటు పట్టణంలో అక్రమ కట్టడాలు అక్రమ వెంచర్లు ప్రజలను ఇబ్బందులు పరచే విధంగా రెండేసి మూడేళ్లు సార్లు రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని అన్నారు కడం రిసార్ట్ పై పూర్తిస్థాయి విచారణ ఆదేశించారు అలాగే కడం పెద్దూర్ ప్రాంతంలోని ఇరిగేషన్ కు సంబంధించిన భూములతో పాటు బెల్లల్ కుర్రు భూములు మైసంపేట గిరిజన రైతులకు చెందిన భూములు ఆక్రమించుకున్నారని ఈ సమావేశంలో గిరిజనులు కలెక్టర్కు ఆర్జీలు సమర్పించారు ఖానాపూర్ కడెం మండల కేంద్రాల్లోని చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల లోపు ఎలాంటి ప్రభుత్వ భూమి ఉన్న అది ఎలాంటి స్థితిలో ఉన్న అక్రమనకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని మండలాల తాసిల్దార్లను ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు ఖానాపూర్ పట్టణ భూములపై మున్సిపాలిటిలో,నిర్మాణాలు అవుతున్న అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రెవెన్యూ అధికారులను మున్సిపల్ శాఖ అధికారులను కలెక్టర్ మందలించారు ఎమ్మెల్యే బొజ్జపటేల్ వివరించిన భూములపై తప్పకుండా చర్యలు ఉంటాయని వాటిని అక్రమన కింద రుజువైతే చర్యలు తప్పవని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ తో పాటు ఇన్చార్జి అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ ఆర్డిఓ దేవిదాస్ మండల తాసిల్దార్ సుజాత రెడ్డి ఎంపీడీవో రాథోడ్ రాధా మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ ఏఈ విద్యుత్తు రామ్ సింగ్ తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు

# గిరిజనుల రాజుల కోటను పరిశీలించిన ఐటీడీఏ పీఓ మంద మకరందు







## పెండింగ్‌లో ఉన్న పనులను అక్టోబర్ 30లోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**ఉట్నూరు, అక్టోబర్ 6, (ప్రజా జ్యోతి)** గిరిజనుల చరిత్ర, సంస్కృ తి, సంప్రదాయాలకు ప్రతీక గా నిలిచిన చారిత్రక ప్రదేశా లను పరిరక్షించడంతో పా టు, వాటిని పర్యాటక ప్రాం తాలుగా అభివృద్ధి చేసేందు కు చర్యలు చేపడుతున్నా మని సమగ్ర గిరిజన అభివృ ద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు తెలిపారు. మంగళవారం ఉదయం ఉట్నూరు మండల పరిధిలోని గిరిజనుల రా జుల కోటను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు పరిశీలించారు. ఈ సంద ర్భంగా కోట ప్రాంగణంలోని చారిత్రక కట్టడాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి, కోటకు సంబంధించిన చారిత్ర క వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోట ప్రాంతంలో కొనసాగు తున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల పు రోగతిని పీఓ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ఈ నెల 30వ తేదీ (30.10.2026)లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులలో నాణ్యత ప్రమా ణాలను పాటిస్తూ, నిర్ణీత గ డువులోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిపై ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేపట్టా లని అధికారులకు సూచిం చారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదా యాలను ప్రతిబింబించే ఇ టువంటి చారిత్రక ప్రదేశాల ను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గిరిజనుల వీరగాథలు, చారిత్రక నేప థ్యాన్ని ప్రజలకు, ముఖ్యం గా యువతకు తెలియజేసే విధంగా చారిత్రక ప్రదేశాల ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కోట ప్రాంతంలో పర్యా టకులకు అవసరమైన మౌలిక వసతులు, సందర్శకు లకు అనుకూలమైన సౌక ర్యాలు, పరిశుభ్రత, రహదారి సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత అధి కారులతో పీఓ చర్చించారు. కోటను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను ప రిశీలించి, అవసరమైన ప్రతి పాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న చా రిత్రక, సాంస్కృతిక, ప్రకృతి సంపదను గుర్తించి వాటి ప రిరక్షణకు అవసరమైన చ ర్యలు చేపడతామని మంద మకరందు తెలిపారు. గిరిజ నుల చరిత్ర, సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ప్రాంతాలకు తగిన గుర్తింపు తీసుకురావడంతో పాటు, పర్యాటకుల ను ఆకర్షించే విధంగా అభి వృద్ధి చేసేందుకు చర్యలు తీ సుకుంటామని పేర్కొన్నారు. కోట ప్రాంత అభివృద్ధి పను లను వేగవంతం చేసి, పెం డింగ్ పనులన్నీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయా లని, పనుల నాణ్యత విష యంలో ఎలాంటి రాజీ ఉం డకూడదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో సంబంధిత అధి కా రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

## ఆరోపణలు నిరూపించాలి

## బీజేపీ నాయకుల హెచ్చరిక




**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):):** బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగత ఆరోపణలు చేస్తే సహించేది లేదని హాజీపూర్ మండల అధ్యక్షులు గడ్డం స్వామి రెడ్డి, మంచిర్యాల కార్పొరేషన్ గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్‌కుమార్, నస్పూర్ జోన్ అధ్యక్షులు కర్రె చక్రవర్తి హెచ్చరించారు. బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులపై బీజేపీలో ప్రస్తుతం ఎలాంటి బాధ్యతలు లేని బొలిశెట్టి తిరుపతి, పార్టీ నుంచి సస్పెండ్ అయిన మడిపల్లి సత్యం వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు .కొంతమంది భూ సెటిల్మెంట్ చేసే వ్యక్తులతో కలిసి పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తూ, పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తున్న నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా రఘునాథ్ వెరబెల్లి నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. జాతీయ రహదారి-63 విషయంలో రఘునాథ్ వెరబెల్లి ఎవరికి నష్టం కలగకుండా లక్షెట్టిపేట పట్టణం మీదుగా కాకుండా పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని మాత్రమే కోరారని, అలైన్‌మెంట్ మార్చాలని ఎక్కడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరలేదని స్పష్టం చేశారు. జాతీయ రహదారి విషయంలో రఘునాథ్ వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకున్నారంటూ చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలను నిరూపించలేని పక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తలను అవమానించేలా కొందరు నాయకులకు పదవులు ఇస్తున్నారని వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. గతంలో బొలిశెట్టి తిరుపతిని హాజీపూర్ మండల అధ్యక్షుడిగా, మడిపల్లి సత్యంను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించి పార్టీ బాధ్యతలు అప్పగించిన రఘునాథ్ వెరబెల్లినే ఇప్పుడు వారు పాలేరులా అంటూ ప్రశ్నించడం సమంజసం కాదన్నారు. అలాగే బొలిశెట్టి తిరుపతి కుమారుడికి గతంలో బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా, ప్రస్తుతం యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు ఇప్పించడంలో రఘునాథ్ వెరబెల్లి పాత్ర ఉందని గుర్తు చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న రఘునాథ్ వెరబెల్లి, వెంకటేశ్వర్ గౌడ్‌లపై ఇకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అమిరిశెట్టి రాజ్‌కుమార్, గడ్డం స్వామి రెడ్డి, కర్రె చక్రవర్తి, మధువరపు రమణరావు, బియ్యాల సతీష్‌రావు, హనుమండ్ల శ్రీనివాస్, కొట్టే ప్రశాంత్, మెరెడికొండ శ్రీనివాస్, రాజనర్సు, కొంకటి మహేందర్, ఇలవేణి సతీష్, సాగర్, చిందం తిరుపతి, బూర్ల అజయ్, కంపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల నెత్తిన పెచ్చుల ముప్పు!

**భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కూలిన స్లాబ్ పెచ్చులు**
**ముగ్గురు చిన్నారులు.. ఇద్దరు మహిళలకు గాయాలు**
**పరుగులు తీసిన పిల్లలు.. తప్పిన పెను ప్రమాదం**
**తేలివాడ అంగన్వాడీలో కలకలం**
**భవనం భద్రతపై స్థానికుల ఆందోళన**

**ఆసిఫాబాద్ అక్టోబర్ 6 ప్రజా జ్యోతి** చిన్నారులు మధ్యాహ్న భోజనం చేస్తున్న సమయంలో అంగన్వాడీ భవనం స్లాబ్ పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడటంతో కలకలం రేగింది. ఈ ఘటన ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్‌లోని తేలివాడ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రమాదంలో ముగ్గురు చిన్నారులతో పాటు ఇద్దరు మహిళలు గాయపడ్డారు. చిన్నారులు భోజనం చేస్తుండగా స్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడటంతో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. ప్రమాదాన్ని గుర్తించిన పిల్లలు అప్రమత్తమై పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే పెచ్చులు తగలడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించారు.

**భవనం పరిస్థితిపై అనుమానాలు**

నిత్యం చిన్నారులు ఉండే అంగన్వాడీ కేంద్రంలో స్లాబ్ పెచ్చులు ఊడిపడటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం పరిస్థితిని అధికారులు వెంటనే పరిశీలించాలని కోరుతున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రమాదకరంగా ఉన్న స్లాబ్, గోడలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



**ముందే చర్యలు తీసుకుంటే..**

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. భవనం నాణ్యతపై పూర్తిస్థాయి పరిశీలన చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, అప్పటివరకు చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# దసరా, దీపావళి పండుగల సందర్భంగా కేంద్రం బోనస్ ప్రకటన

**సింగరేణి కార్మికులకు కూడా రూ.1,10,250 బోనస్**
**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్ర ప్రభుత్వం బోనస్‌ను ప్రకటించింది. ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సింగరేణికి తెలంగాణ ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. సింగరేణి కార్మికులకు ముందస్తు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు

# ఓటు చోరీ చేసి అధికారంలోకి వచ్చారు

**కేంద్ర ప్రభుత్వంపై ఎంపీ వంశీకృష్ణ తీవ్ర విమర్శలు**
**ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి**

**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** దేశంలో ఎన్నికల వ్యవస్థ, ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీలో ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు నిరంకుశ పాలనను తలపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చారనే ఆరోపణలు నిజమైతే, అది దేశ చరిత్రలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య సంక్షోభంగా మారుతుందని అన్నారు. ఓట్లు గెలవలేక చీటింగ్ చేసి పరీక్షల్లో పాస్ అయినట్టుగా ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చారని కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి వంశీకృష్ణ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ప్రతిపక్షాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. 13 కోట్ల మంది ఓటర్ల హక్కులను తొలగించారనే ఆరోపణలు ఉన్నాయని, ప్రజల నుంచి ఓటు హక్కును దూరం చేసే ప్రయత్నాలు జరిగితే అది ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారుతుందని ఎంపీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు తమ రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించకుండా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతోందని అన్నారు. ఎన్నికల్లో అవకతవకల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఓటర్ల హక్కులను పూర్తిగా పరిరక్షించాలని వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగేలా పారదర్శకత పాటించాలని, ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని కోరారు. ఓటు హక్కుకు సంబంధించిన ఆరోపణలపై ప్రజలకు



స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అన్నారు. "చీటింగ్ చేసి పరీక్షల్లో పాస్ అయిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పేవారు.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు సంబంధించిన ఆరోపణలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు?" అని ఎంపీ ప్రశ్నించారు. దేశ ప్రజలు జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఈ అంశంపై ప్రజలే తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈవీఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు

**24 గంటలు సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**
**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**




**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు తెలిపారు. నస్పూర్‌లోని ఈవీఎం గోదామును ఎన్నికల విభాగం అధికారులతో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ , ఈవీఎం గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదాము పరిసరాలను 24 గంటల పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గోదాము భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ అసెస్మెంట్ పోర్టల్‌పై నిర్వాహకులకు అవగాహన అవసరం

## ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు స్మార్ట్ అసెస్మెంట్ పోర్టల్ (పీసీఎస్ఏపీ)పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. మంగళవారం మంచిర్యాల సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పీసీఎస్ఏపీ యాప్ వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, ఆసిఫాబాద్ జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్, ఆసిఫాబాద్ పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజిత, జిల్లా సహకార అధికారి కరుణాకర్, ఎఫ్‌సీఐ అధికారి సుభీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, నిర్ణీత మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాలను కొంత ఎత్తైన, చదునైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయడంతో పాటు గోనె సంచులను భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ, మరుగుదొడ్లు, విద్యుత్, టేబుళ్లు, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు తదితర సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రెండు ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, 30 టార్పాలిన్లు, ఒక ప్యాడీ క్లీనర్





అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్యాడీ క్లీనర్ అందుబాటులో లేని చోట ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల నుంచి వరుస క్రమంలో ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పుడు తేమ శాతం 17 శాతానికి మించి ఉంటే, ధాన్యాన్ని ఆరబెట్టుకుని తేమ శాతం తగ్గిన అనంతరం తీసుకురావాలని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయానికి వచ్చే రైతుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ నకళ్లను తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఏడు రకాల ధాన్యానికి మాత్రమే బోనస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు చేసే ముందు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పీసీఎస్ఏపీ యాప్‌లోని 16 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ధాన్యానికి సంబంధించిన స్పష్టమైన, ఖచ్చితమైన ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ వి.రాములు సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# 24 డిమాండ్ల అగ్రిమెంట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి

**అగ్రిమెంట్లు చేయించడమే కాదు..**

**అమలు చేయించే బాధ్యత కూడా మనదే**

**కొత్త గనులు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలి**

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,**

**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతూ సాధించిన అగ్రిమెంట్లను పూర్తిస్థాయిలో అమలు చేయించే వరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పోరాటం కొనసాగిస్తుందని యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం 'సేవ్ సింగరేణి' జాతా, హెడ్ ఆఫీస్ ముట్టడి, సమ్మె నోటీసు వంటి అనేక ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సమ్మె నోటీసు అనంతరం ఆర్ఎల్‌సీ వద్ద జరిగిన వివిధ దశల చర్చల ద్వారా 24 ప్రధాన డిమాండ్లపై అగ్రిమెంట్ సాధించామని అన్నారు. అగ్రిమెంట్లు కాగితాలకే పరిమితం కాకుండా అందులో పొందుపరిచిన ప్రతి అంశం కార్మికులకు పూర్తిస్థాయిలో అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. "అగ్రిమెంట్లు చేయించేది మనమే.. వాటిని అమలు చేయించే బాధ్యత కూడా మనదే" అని స్పష్టం చేశారు. అగ్రిమెంట్లు చేసి చేతులు దులుపుకునే సంఘం ఏఐటీయూసీ కాదని, సాధించిన హక్కులను కాపాడుతూ వాటి అమలు కోసం నిరంతరం పోరాడే సంఘమని తెలిపారు. యాజమాన్యం ఇచ్చిన హామీలు, కుదిరిన అగ్రిమెంట్లను అమలు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, కార్మికుల ప్రయోజనాల విషయంలో రాజీ ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అగ్రిమెంట్ల అమలులో ఏదైనా జాప్యం లేదా నిర్లక్ష్యం జరిగితే కార్మికులను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణే ఏఐటీయూసీ లక్ష్యం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, అగ్రిమెంట్ల సాధనతో పాటు సాధించిన అగ్రిమెంట్ల అమలు కోసం ఏఐటీయూసీ నిరంతరం ఉద్యమాలను కొనసాగిస్తుందని తెలిపారు. ప్రతి గనిలో, ప్రతి డిపార్ట్‌మెంట్‌లో కార్మికులను సంఘటితం చేసి వారి సమస్యలను గుర్తించి, పరిష్కారం కోసం మరింత బలమైన ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. సింగరేణి భవిష్యత్తు యువ కార్మికుల చేతుల్లోనే ఉందని అన్నారు. యువ కార్మికులకు యూనియన్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించడంతో పాటు బాధ్యతలు, నాయకత్వ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. యువతను సంఘటితం చేసి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సింగరేణికి కొత్త గనులు.. యువతకు కొత్త ఉద్యోగాలు రావాలన్నారు .సింగరేణి సంస్థను బలోపేతం చేయడానికి కొత్త గనుల ఏర్పాటు అత్యవసరమని ఏఐటీయూసీ--ఎస్‌సీడబ్ల్యూయూ నాయకులు డిమాండ్ చేశారు. వేలం ప్రక్రియలో సింగరేణి యాజమాన్యం మరింత చురుగ్గా పాల్గొని కొత్త గనులను దక్కించుకోవాలని కోరారు. కొత్త గనులు ప్రారంభమైతే యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు సంస్థ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, భవిష్యత్ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్త గనుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**యువ కార్మికుల భారీ చేరికలతో ఏఐటీయూసీకి కొత్త బలం**

శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్‌సీడబ్ల్యూయూ ( ఏఐటీయూసీ) కు యువ కార్మికుల నుంచి భారీ స్పందన లభించింది. ఎస్ఆర్‌పీ-3 గనిలో 309 మంది, ఎస్ఆర్‌పీ-1 గనిలో 156 మంది కలిపి మొత్తం 465 మంది యువ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. రెండు గనుల్లోని మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్ కార్మికులు పెద్ద సంఖ్యలో యూనియన్‌లో చేరడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం



మురళీ చౌదరి, దాడి రాజయ్య అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లకు పెద్ద సంఖ్యలో యువ కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ--ఎస్‌సీడబ్ల్యూయూ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ ఎస్కే బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య యువ కార్మికులకు ఏఐటీయూసీ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఘనంగా స్వాగతం పలికారు. యువ కార్మికులు పెద్ద సంఖ్యలో ఏఐటీయూసీలో చేరడం కార్మిక ఉద్యమానికి కొత్త బలం, నూతన ఉత్సాహాన్ని ఇస్తుందని నాయకులు అన్నారు. కార్మికుల హక్కులు, ప్రయోజనాలు కేవలం మాటలతో కాకుండా పోరాటాలు, ఉద్యమాల ద్వారానే సాధించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ రాచర్ల చంద్రమోహన్, జీఎం చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, అడ్డ శ్రీనివాస్, సురేష్, జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మీడియా అధికార ప్రతినిధి రాజ్‌కుమార్, ఆర్కే-5 పిట్ సెక్రెటరీ నర్సింగరావు, ఎస్ఆర్‌పీ-3 అసిస్టెంట్ పిట్ సెక్రెటరీలు అంబాల రవి, కారుకూరి నగేష్, వైస్ ప్రెసిడెంట్ తౌటం మల్లేష్, ఎస్ఆర్‌పీ-1 అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీ నామా చేయాలి

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్**

**సర్ ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

**ఆదిలాబాద్ లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియలో పా రదర్శకతపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇండియా కూట మి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ నాయకత్వంలో మంగళవారం కలెక్ట రేట్ ఎదుట భారీ నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి డా. నరేష్ జాదవ్, ఆదిలాబాద్ నియో జకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీని వాస్ రెడ్డి, బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రె టరీ గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కూటమిలోని సిపిఐ, సపిఎం, ఏఐఎంఐఎం, ఆప్, తదితర పార్టీల నాయకులు వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా క లెక్టరేట్‌కు చేరుకున్నారు.కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో “సీఈసీ జ్ఞానేష్ కు మార్ రాజీనామా చేయాలి”, “ఓట్ చోర్ గద్దే ఛోడ్”, “మోదీ డౌన్ డౌన్” అంటూ నినాదాలు చేస్తూ కేంద్ర ప్ర భుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరి స్తోందని, వచ్చే ఎన్నికల్లో రా జకీయ లబ్ధి పొందేందుకు ఎన్నికల వ్యవస్థను ప్రభావి తం చేసే కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండా లని అన్నారు.ఇటీవల వెలువడిన పరిశోధనాత్మక కథ నాలను ప్రస్తావిస్తూ, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సిర్ సంధు, డా. వివేక్ జోషి గత పది నెలల్లో పలు సందర్భాల్లో ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఆదేశాలపై అధి కారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని డా. న రేష్ జాదవ్ తెలిపారు. ఈ అంశాలపై ఎన్నికల సంఘం పూర్తి వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించకూడదని ఆయన అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు తగిన నోటీసు ఇ వ్వడంతో పాటు, తన వాద న వినిపించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత, సంస్థా గత స్వతంత్రత, ప్రజల నమ్మకాన్ని కాపాడేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవి కి రాజీనామా చేయాలని డా. నరేష్ జాదవ్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల మధ్య నమోదైనట్లు నివేదించబడిన అభ్యంతరాలు, సంబంధిత ఫైళ్లు, అంతర్గత నోట్లు, సమావేశాల మినిట్స్‌ను చట్టపరమైన పరిమితులకు లోబడి పారదర్శకంగా వెల్లడించాలని, సర్‌లో ఓటర్ల పేర్ల తొలగింపు పునరుద్ధ రణ విధానంపై స్వతంత్ర సమీక్ష చేపట్టాలని కోరారు.అనంతరం ఆర్డీఓ కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి,మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, బోథ్ మార్కెట్ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, ఆదిలాబాద్ ఆత్మ కమి టీ చైర్మన్ గిమ్మ సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజర్ పాషా, ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, సిపిఐ ప్రభాకర్ రెడ్డి, సిపిఎం పార్టీ నుండి బండి దత్తాత్రే, సిపి ఎం డిస్ట్రిక్ట్ సెక్రటరీ మల్లేష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిస్టిక్ సెక్రెటరీ జగన్ సింగ్, ఎంసిపిఐ కుంటాల రాములు, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి రాథోడ్ సుభాష్, సిపిఐ ఎం ఎల్ నుండి మడావి గణేష్, తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ విభాగం చైర్మన్ పరమేశ్వర్, ఎస్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు సేద్మకి ఆనంద్ రావు, జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ, మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షాహిద్,యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు నాహిద్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, జిల్లా కాం గ్రెస్ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు,మున్సిపల్ కౌన్సిలర్లు, టౌన్ కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యు వజన కాం గ్రెస్,ఎన్ఎస్ యుఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్త లు తదితరులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.






# నీటిని పొదుపుగా వినియోగించి పంటలను కాపాడుకోవాలి



ఎమ్మెల్యే పాయల్ శంకర్







**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** ఎల్‌నినో ను దృష్టిలో ఉంచు కుని రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. మంగళవారం కోర్టా-చనాకా ప్రాజె క్టు నుంచి సాగునీటిని విడుదల చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ తక్కువ వర్షపాతం, ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహాలు లేకపోవడం, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన కాలువల ద్వారా వచ్చే నీటిని స్థానిక చెరువులు, కుంటలు, వాగులు, ఇతర నీటి వనరులను నింపేలా సమర్థవంతంగా వినియో గించుకోవాలని సూచించారు. ఇందుకోసం స్థానిక ప్ర జాప్రతినిధులు, నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి వినియోగంలో సామర్థ్యాన్ని పెంచాలని కోరారు.రైతులు పం టలకు అవసరమైన మేరకే నీటిని వినియోగిస్తూ వృథాను నివారించాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమష్టి కృషితో అందుబా టులో ఉన్న నీటితో పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులుగిమ్మ సర్పంచ్ సన్నీ,అకోలి సర్పంచ్ శంభు,బోరజ్ సర్పంచ్ సాయి వర్మ, కామాయి సర్పంచ్ వికాస్, లేఖరవాడ సర్పంచ్ ప్రభాకర్,అశోక్ రెడ్డి, భూమన్న, రాందాస్, శైలేందర్, రమేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాస్‌లు వెంటనే అమలు చేయాలి

## మంత్రి పొన్నం ప్రకటనను స్వాగతిస్తున్నాం

## డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు




**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సీనియర్ సిటిజన్లకు ఉచిత ఆర్టీసీ బస్ పాస్‌లు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడాన్ని డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వాగతించింది. ఈ సౌకర్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా అమలు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఘట్‌కేసర్ సర్కిల్‌లోని సుప్రభాత్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ మధ్య వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన వార్తల ప్రకారం సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాస్‌లు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారని తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని 60 సంవత్సరాలు నిండిన ప్రతి సీనియర్ సిటిజన్‌కు ఉచిత ఆర్టీసీ బస్ పాస్‌ను ప్రకటించి అమలు చేయాలని కోరారు. వృద్ధాప్యంలో వైద్య సేవలు, మందులు, పెన్షన్, బ్యాంకు పనులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడం తదితర అవసరాల కోసం సీనియర్ సిటిజన్లు తరచూ ప్రయాణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో బస్సు చార్జీలు కూడా వృద్ధులకు ఆర్థిక భారంగా మారుతున్నాయని తెలిపారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి సీనియర్ సిటిజన్‌కు ఎలాంటి వివక్ష లేకుండా ఉచిత బస్ పాస్ అందించాలని డిమాండ్ చేశారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు లగ్జరీ, రాజధాని, గరుడ తదితర ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న తరహాలోనే సమాజానికి జీవితాంతం సేవలందించిన వృద్ధులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ప్రకటించడం సీనియర్ సిటిజన్లకు ఆశాజనకంగా ఉందని తెలిపారు. ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా వృద్ధుల పట్ల ప్రభుత్వ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లందరికీ ఉచిత ఆర్టీసీ బస్ పాస్‌లను దసరా కానుకగా ప్రకటించి, అమలు తేదీని స్పష్టంగా వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాజి రెడ్డి, ఎస్. లక్ష్మి నారాయణ, ఎం. సత్యనారాయణ, బంగారి మల్లయ్య, రాసకట్ల పోశం, కొట్టే మల్లయ్య, ఏ. ప్రభాకర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వివేక్, వంశీకృష్ణ పద్ధతి మార్చుకోవాలి





**లేకుంటే జగన్మోహన్‌రావు వర్గాన్ని కాంగ్రెస్ నుంచి బహిష్కరింపజేస్తాం**

**ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయుల హెచ్చరిక**

**ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి కూడా ఇవ్వాలని డిమాండ్**

**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తమ పద్ధతిని మార్చుకోవాలని, లేనిపక్షంలో మంతెన జగన్మోహన్‌రావు వర్గాన్ని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించేలా అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు మంచిర్యాలలో హెచ్చరించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంత్రితో పాటు రాష్ట్ర పీసీసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వద్ద కుట్ర రాజకీయాలు సాగవని స్పష్టం చేశారు. మంచిర్యాల అభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యేకు మంత్రి పదవి కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు నివాసంలో మంగళవారం మంచిర్యాల నగర మేయర్ మధుకర్, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు తూముల నరేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు పూదరి తిరుపతి మీడియాతో మాట్లాడారు. పలు అంశాలు తెలిపారు . మంచిర్యాల అభివృద్ధిలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చేస్తున్న కృషిని జీర్ణించుకోలేని మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ వర్గపోరుకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ కండువా కప్పుకోని మంతెన జగన్మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలకు తెరలేపడం సరికాదని, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసి, సంబంధిత వర్గంపై పార్టీ పరంగా చర్యలు తీసుకునేలా తమ కార్యాచరణ కొనసాగుతుందని తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ నిధులను ఒకటి, రెండు డివిజన్లకే కేటాయించడం సరికాదని, అన్ని డివిజన్ల ప్రజలు ఓటు వేస్తేనే ఎంపీగా విజయం సాధించారని వారు వ్యాఖ్యానించారు. కార్పొరేషన్ పరిధిలో ఆ వర్గం నిర్వహిస్తున్న కార్యక్రమాల ఫ్లెక్సీలలో ప్రథమ పౌరుడైన మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు ఏఎంసీ చైర్మన్ ఫొటోలను పెట్టకపోవడం తీవ్ర అభ్యంతరకరమని, ఈ విషయంలో మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ చర్యలను తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పదేళ్ల కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతంగా కొనసాగించడంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కీలకంగా పనిచేశారని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమావేశం, ఇంద్రవెల్లి సభతో పాటు కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రేమ్‌సాగర్‌రావు కీలక పాత్ర పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు, కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకే ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంచిర్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలని కూడా ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సమవె3శమ్ లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనిల్ కుమార్‌ను పరామర్శించిన సత్తు మల్లేష్



**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 ప్రజా జ్యోతి** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కాప్రే అనిల్ కుమార్ తండ్రి మల్లయ్య మృతి చెందడంతో మంగళవారం ఆయన నివాసానికి కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించిన సత్తు మల్లేష్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మల్లయ్య మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. మల్లయ్య కుటుంబంతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పితృ వియోగంతో బాధలో ఉన్న అనిల్ కుమార్‌ను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని సూచించారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, సుద్దాల శీను, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎనుకొండ కమల్‌నాథ్, నితిన్, చాపిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సత్తు మల్లేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**విధుల్లో సమయపాలన పాటించాలి: కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 ప్రజా జ్యోతి** ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవలు, మందుల పంపిణీ, అల్పాహారం, భోజనం అందుతున్న తీరుపై ఆరా తీశారు.వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటిస్తూ రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో ఆసుపత్రి సందర్శన సమయంలో లిఫ్ట్ పనిచేయక రోగులు ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చి నట్లు తెలిపారు.అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. రోగులు, సహాయకుల కు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజనం అందించాలని సూచించారు. క్యాంటీన్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని నిర్వాహకులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు క్యాంటీన్ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు కిరణ్, వైద్యులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## యువకుడి మృతితో విషాదం




**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 ప్రజా జ్యోతి** మండలంలోని గుండి గ్రామానికి చెందిన తిరుసుల్ల సత్తయ్య కుమారుడు తిరుసుల్ల సాయికుమార్ మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. చేతికొచ్చిన కుమారుడిని కోల్పోవడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. సాయికుమార్ మృతివార్త తెలియడంతో బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి. మృతుడి కుటుంబాన్ని పలువురు బంధువులు, గ్రామస్థులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయికుమార్ మృతితో కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని పేర్కొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 6,( ప్రజాజ్యోతి )**ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వ్యవసాయ సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారిగా పూర్తి చేయాల్సిన ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే, ఇప్పటి వరకు పూర్తయిన ప్రక్రియ, ఇంకనూ పూర్తి చేయాల్సిన ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏకకాలంలోనే డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. వాలంటీర్లు అందరూ డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షణ ఉంచాలని పేర్కొన్నారు. పంటల కోతల సమయానికి మునుపే డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ మొత్తాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు.రాబోయే రబీ పంట కాలంలో రైతులు పంట మార్పిడి విధానాలు విస్తృతంగా పాటించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి రైతుతో మాట్లాడి పంట మార్పిడి విధానాల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, మండల వ్యవసాయ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తరించాలి

**ఎమ్మెల్యే పాయల శంకర్**

**నూతన పాలక వర్గంకు సన్మానం**




**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6, (ప్రజాజ్యోతి)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించి పేదలు, నిరుపేదలు, బాధితులు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఆడే క్రాంతికు మార్, వైస్ చైర్మన్ మనోహర్, సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజ హితం కోసం నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయా లని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## అంగన్వాడీలో పెచ్చులు ఊడి.. చిన్నారులకు గాయాలు

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 ప్రజా జ్యోతి** అంగన్వాడీ కేంద్రంలో స్లాబ్ పెచ్చులు ఊడిపడిన ఘటనలో గాయపడిన చిన్నారులు, వారి తల్లులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తేలిగూడ అంగన్వాడీ కేంద్రంలో స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో ఇద్దరు చిన్నారులతో పాటు వారి తల్లులకు గాయాలయ్యాయి.విషయం తెలుసుకున్న కలెక్టర్ హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు గాయాల తీవ్రత, అందుతున్న చికిత్స, వైద్య పరీక్షలు, మందుల లభ్యతపై వైద్యులను ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని సూచించారు. ప్రస్తుతం చిన్నారులు, వారి తల్లుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాల భవనాల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రమాదకర పరిస్థితులు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు కిరణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోల్స్ వచ్చాయి.. సిగ్నళ్లు వచ్చాయి..కానీ ప్రారంభం ఎప్పుడో..????

**మంచిర్యాల పట్టణం లో నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని ట్రాఫిక్ సిగ్నళ్లు**

**నత్తనడకన పనులు.. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నరకం విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు**

**వెంటనే సిగ్నళ్లను ప్రారంభించాలని పట్టణ ప్రజల డిమాండ్**









**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మంచిర్యాల జిల్లాకు, ముఖ్యంగా జిల్లా కేంద్రం మంచిర్యాల పట్టణానికి ప్రత్యేక స్థానం ఉంది. వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని విధాలుగా పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. చుట్టుపక్కల మండలాలు, పట్టణాల నుంచి వివిధ పనుల నిమిత్తం నిత్యం వేలాది మంది మంచిర్యాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పట్టణంలో వాహనాల సంఖ్య కూడా భారీగా పెరిగి ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. తరచూ ట్రాఫిక్ గందరగోళం ఏర్పడటంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో నూతనంగా ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేస్తున్నప్పటికీ.. అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు.

### నాలుగు చోట్ల సిగ్నళ్లు.. ప్రారంభం ఎప్పుడో..?!

పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అంబేద్కర్ చౌరస్తా, వెంకటేశ్వర టాకీస్, బెల్లంపల్లి చౌరస్తా, ఎన్టీఆర్ చౌక్ (లక్ష్మి టాకీస్ ) తదితర ప్రధాన కూడళ్ల వద్ద నూతనంగా ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుకు పనులను చేపట్టారు. సిగ్నల్ పోల్స్ ఏర్పాటు చేసినప్పటికీ వాటికి అవసరమైన విద్యుత్, సాంకేతిక కనెక్షన్లు, ఇతర పనులు పూర్తికాకపోవడంతో అవి అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో సిగ్నళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నరకం

బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్ ,చెన్నూర్ ,నస్పూర్, లక్సెట్టిపేట, హాజీపూర్, దండేపల్లి, తదితర ప్రాంతాల నుంచి ప్రజలు నిత్యం వివిధ పనుల కోసం మంచిర్యాలకు వస్తుంటారు. అంతేకాకుండా ఆసిఫాబాద్, హైదరాబాద్, కరీంనగర్,కొత్తగూడెం ,గోదావరిఖని ,చెన్నూర్ ,బెల్లంపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు కూడా మంచిర్యాల పట్టణం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా ఉదయం పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ప్రారంభమయ్యే సమయంలో, సాయంత్రం అవి ముగిసే వేళల్లో ట్రాఫిక్ మరింత తీవ్రంగా మారుతోంది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిదూరం వెళ్లేందుకు కూడా ఎక్కువ సమయం పడుతుండటంతో వాహనదారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

### నత్తనడకన పనులు.. అధికారుల నిర్లక్ష్యమా?

ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సిగ్నల్ పోల్స్ ఏర్పాటు చేసి వదిలేయడంతో సమస్య పరిష్కారం కాకపోగా, ప్రజల్లో మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి సిగ్నళ్లను ప్రారంభించేందుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఎప్పుడో..?

మంచిర్యాల పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. కేవలం సిగ్నళ్లు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా వాటిని నిరంతరం పనిచేసేలా చూడటం, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ పెంచడం, రహదారులపై ఆక్రమణలను తొలగించడం, వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### ట్రాఫిక్ సిగ్నళ్ల ను వెంటనే ప్రారంభించాలి

వివిధ పనుల నిమిత్తం నిత్యం మంచిర్యాలకు వస్తున్న ప్రజలు ట్రాఫిక్ సిగ్నళ్లు లేకపోవడంతో ప్రధాన కూడళ్ల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు. సిగ్నళ్ల ఏర్పాటు పూర్తయిన వెంటనే వాటిని ప్రారంభిస్తే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించి సిగ్నళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఇంత ముఖ్యమైన ఈ అంశంలో మున్సిపల్ ,ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ స్పందించాల్సిన అవసరం ఉన్నది .మంచిర్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లను త్వరగా ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. సిగ్నళ్లు అందుబాటులోకి వస్తే ప్రధాన కూడళ్లలో వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించడంతో పాటు ప్రమాదాల నివారణకు కూడా అవకాశం ఉంటుందన్నది వాస్తవ విషయం .కాబట్టి ఇప్పటికైనా మరింత జాప్యం చేయకుండా మంచిర్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి,ఇందుకు నగరపాలక సంస్థ కమిషనర్ చొరవ చూపి మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా సంబంధిత గుత్తేదారును ఆదేశించి, సిగ్నళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను కొంతమేరకు తగ్గించవచ్చని,. సిగ్నళ్ల ప్రారంభంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జీఎం ఎడ్యుకేషన్‌కు ఘన సత్కారం

**పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధిపై సమీక్ష**

**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్) రాజేంద్ర ప్రసాద్ శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. పర్యటనలో భాగంగా శ్రీరాంపూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి, కళాశాలలో కొనసాగుతున్న విద్యా, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కార్యక్రమాలతో పాటు భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కళాశాల యాజమాన్యంతో చర్చించారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌ను జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్) రాజేంద్ర ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ విద్యారంగంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలతో పాటు శ్రీరాంపూర్ ఏరియాలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల, సింగరేణి హైస్కూల్ నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు జీఎంలు చర్చించారు. అనంతరం జీఎం ఎడ్యుకేషన్ (కార్పొరేట్) రాజేంద్ర ప్రసాద్‌ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ శాలువా కప్పి, పూలమొక్క అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్, ప్రిన్సిపాల్ డేనీల్ కుమార్, మైనింగ్ హెచ్ఓడీ నర్సింహస్వామి, ఎలక్ట్రికల్ హెచ్ఓడీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిలో పగిలిన గచ్చు.. రోగులకు తప్పని తిప్పలు!

**సదరం క్యాంప్‌కు వచ్చిన వృద్ధులు, చిన్నారులకు అవస్థలు**

**అడుగడుగునా ప్రమాదం.. పట్టించుకోని అధికారులపై విమర్శలు**

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 6, ప్రజా జ్యోతి:**మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంప్‌కు వచ్చే రోగులకు కనీస వసతులు కరువవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరం క్యాంప్‌లో భాగంగా ఆసుపత్రికి వచ్చిన వికలాంగులు, వృద్ధులు, చిన్నారులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఆసుపత్రి ప్రాంగణంలోని రోగులు నడిచే మార్గంలో గచ్చు పగిలి, గుంతలు ఏర్పడటంతో అడుగు వేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, నడవడానికి ఇబ్బందులు ఉన్న రోగులు ఈ మార్గంలో వెళ్లేటప్పుడు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది.

**..అడుగు వేస్తే ఎక్కడ పడిపోతామో?**

సదరం క్యాంప్‌కు వచ్చిన పలువురు రోగులు, వారి కుటుంబ సభ్యులు గచ్చు పగిలిన ప్రాంతంలో కాలు జారడం, గుంతలో కాలు పడటం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. చిన్నారులు సైతం అక్కడ జారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు సురక్షితమైన నడక మార్గం లేకపోవడం మరింత





ఇబ్బందికరంగా మారింది. నడవడానికి ఆసరా అవసరమైన వృద్ధులు, కాళ్ల సమస్యలతో వచ్చిన వారు పగిలిన గచ్చు వద్ద తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

**రోగులకు వసతులు కల్పించాల్సిన ఆసుపత్రిలోనే ప్రమాదకర పరిస్థితులు!**

ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. సదరం క్యాంప్‌ల సమయంలో రోగుల సంఖ్య మరింత పెరుగుతుంది. అలాంటి సమయంలో రోగులు కూర్చోవడానికి, నడవడానికి, క్యాంప్‌కు వెళ్లి తిరిగి రావడానికి కనీస వసతులు, సురక్షితమైన మార్గాలు ఉండాల్సిన అవసరం ఉంది.

కానీ ఆసుపత్రి ప్రాంగణంలోనే గచ్చు పగిలిపోయి ప్రమాదకరంగా మారడంతో రోగులు, వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే పగిలిన గచ్చును మరమ్మతు చేసి ప్రమాదాలను నివారించాలని రోగులు కోరుతున్నారు.

**...అధికారులు స్పందించాలి**

సదరం క్యాంప్‌కు వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రి అధికారులు వెంటనే పగిలిన గచ్చును పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, వికలాంగులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా అవసరమైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా.. పగిలిన గచ్చుకు మరమ్మతులు చేపట్టి రోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# పాత ఆస్పత్రి శిథిలావస్థలో.. కొత్తది సిద్ధంగా ఉన్నా ఎందుకు ప్రారంభించరు?

**450 పడకల ఆస్పత్రి సిద్ధం.. ప్రారంభించడంలో ఎమ్మెల్యేకు ఇబ్బందేంటి**

**రాజకీయ కక్షతో ప్రజలకు వైద్య ఇబ్బందులా?.. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్**

**రోగుల భద్రతను గాలికొదిలారా?.. కొత్త ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి**







**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి శిథిలావస్థకు చేరిందని, రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ఆరోపించారు. మంగళవారం ఆయన మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం విజిత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిందని, స్లాబ్ పెచ్చులు ఊడుతున్న పరిస్థితుల్లోనే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆస్పత్రి భవనం పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో నిర్మించిన 450 పడకల నూతన ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉందని విజిత్ కుమార్ తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు దానిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం వల్ల పాత భవనంలోనే రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుపై ఉన్న రాజకీయ కక్షతోనే నూతనంగా నిర్మించిన 450 పడకల ఆస్పత్రిని ప్రారంభించకుండా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విజిత్ కుమార్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన విషయంలో రాజకీయాలకు తావివ్వకుండా నూతన ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదని ఆరోపిస్తూ ఓ రోగిని అతని కుమారుడు స్ట్రెచర్‌పై ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఇంటి వరకు తీసుకెళ్లిన ఘటనను ఈ సందర్భంగా విజిత్ కుమార్ గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవల పరిస్థితికి ఈ ఘటన అద్దం పడుతోందని అన్నారు. ప్రజలు ఎంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కేవలం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుపై ఉన్న కోపంతోనే నిర్మాణం పూర్తయిన 450 పడకల నూతన ఆస్పత్రిని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లేదని విజిత్ కుమార్ ఆరోపించారు. పాత ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు పూర్తి బాధ్యత ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావే వహించాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న పాత ఆస్పత్రి నుంచి రోగులను నూతనంగా నిర్మించిన 450 పడకల ఆస్పత్రికి తరలించి, వెంటనే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. కొత్త ఆస్పత్రిని ప్రారంభించడంలో మరింత జాప్యం చేస్తే పాత ఆస్పత్రిలో ప్రజలకు ఏదైనా ప్రమాదం జరిగినా అందుకు ఎమ్మెల్యేనే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో పెట్టుకుని నూతనంగా నిర్మించిన 450 పడకల ఆస్పత్రిని తక్షణమే ప్రారంభించి, మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 6 నెలలుగా లాభాల వాటా విడుదల చేయకపోవడంపై ఆగ్రహం

## సింగరేణి వాస్తవ లాభాల్లో 36 శాతం కార్మికులకు ఇవ్వాలి

## శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ధర్నా




**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన వాస్తవ లాభాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సింగరేణి కార్మికుల శ్రమకు తగిన గుర్తింపుగా సంస్థకు వచ్చిన వాస్తవ లాభాల్లో 36 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని నాయకులు కోరారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం ఏరియా ఉపాధ్యక్షులు బండి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా వాస్తవ లాభాల ఆధారంగా కార్మికులకు వాటా చెల్లించకుండా, సంస్థ అభివృద్ధి పేరుతో రూ.6,323 కోట్లను పక్కన పెట్టడాన్ని నాయకులు తీవ్రంగా తప్పుబట్టారు. సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికుల శ్రమే కీలకమని, అలాంటి కార్మికులకు లాభాల వాటా చెల్లించకుండా జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలపై ఆరు నెలలు గడుస్తున్నా వాటా విడుదల చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వాస్తవ లాభాల్లో 36 శాతం వాటాను వెంటనే కార్మికులకు చెల్లించేలా యాజమాన్యం పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్తులో సింగరేణి భవన్‌తో పాటు ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్ తదితర కేంద్ర, ఏరియా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలి



జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





**మంచిర్యాల, 6, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, హౌసింగ్ కార్పొరేషన్ పిడి బన్సీలాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ అధికారి రవీందర్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ తిరుపతి, ఎ.పి.డి. మోహన్ లతో కలిసి వి బి జి రామ్ జి, ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలు, పారిశుధ్యం, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లు, ఇంటి పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్ష సమావేశంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వి బి జి రామ్ జి పథకం క్రింద జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ, వి.ఓ., అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మాణం పూర్తైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఐ.హెచ్.హెచ్.ఎల్. చెల్లింపులు పూర్తయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు మంజూరైన 5.50 కోట్ల రూపాయల నిధులను మెటీరియల్ కాంపోనెంట్ క్రింద వినియోగించి, సంబంధిత భవనాల నిర్మాణ వ్యయాన్ని నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 2 బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జిల్లాలో ఇప్పటికే మంజూరైన 3 వేల 150 ఇంకుడు గుంతలకు మార్కింగ్ పూర్తి చేసి పనులను ప్రారంభించాలని, మిగిలిన ఇంకుడు గుంతలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిశు భ్రతకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, పండుగలు నిర్వహించే ప్రాంతాలలో ముళ్ల పొదలు, చెట్లు తదితర అవరోధాలు ఉంటే సంబంధిత మండల పంచాయతీ అధికారులు వాటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలు, హౌసింగ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 10న ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం





## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్

**ఖానాపూర్ అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి )** వివిధ వామపక్షాల పార్టీలచే ప్రజాస్వామ్య పరిరక్షణ వారం లో భాగంగా ఈ నెల 10వ తేదీన ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంపై కూటమి నాయకులతో నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 10న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణ, ఇండియా కూటమి పార్టీల సమన్వయం తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. నిరసన సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమంలో ఎలాంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలి కేంద్ర ప్రభుత్వంపై కూటమి నాయకుల సూచనలను పరిగణలోనికి తీసుకొని ఈ సమావేశంలో చర్చించారు ఇందులోనిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీహరి రావు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాజీముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సీపీఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కే. రాజన్న, టీజేఎస్ జేఏసీ నాయకులు వాజిద్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ బకాయిలు వెంటనే చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్‌ను కోరిన ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ డిస్మెంటిల్ అయిన నేపథ్యంలో ఆదిలాబాద్ మున్సిపాలి టీకి చెల్లించాల్సినరూ. 4.44 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ సీసీఐ ఫ్యాక్టరీ డిస్మెంటిల్ అయిన సందర్భంలో మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ. 4 కోట్ల 44 లక్షల బకాయిలను వెంటనే చెల్లించాలని, మున్సిపాలిటీకి రావాల్సిన నిధులు అందేలా సీసీ ఐ అధికారులను ఆదేశించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీసీఐ బకాయిల విషయమై గతంలో పలుమార్లు ఢిల్లీ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కా రం కోసం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సీసీఐ మేనేజర్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ సీసీఐ అధికారులు స్పందించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై మరో సారి ఢిల్లీ స్థాయి అధికారులతో మాట్లాడి బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్‌తో పాటు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, పర్వేజ్ మహ బూబ్ నాక్సన్ కిషోర్ సలీం రషీద్ రిజ్వాన్ బబ్లు అన్నపూర్ణ., బిఆర్ఎస్, ఎం ఐఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# 11వ వార్డులో డ్రైనేజీ పనులకు శ్రీకారం

## పనులు వేగంగా పూర్తి చేస్తాం: కౌన్సిలర్ కార్తిక్

**ఆసిఫాబాద్ అక్టోబర్ 6 ప్రజా జ్యోతి** మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులకు కౌన్సిలర్ రాపర్తి కార్తిక్ మంగళవారం శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కాలనీ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ రాపర్తి కార్తిక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రమాదేవి, ఏఈ నవీన్, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



పాల్గొన్నారు.

# క్లెయిమ్స్ అభ్యంతరాలకు రేపే చివరి తేదీ. తహసీల్దార్ బక్కయ్య

**జన్నారం,అక్టోబర్6(ప్రజాజ్యోతి)**ఓటరు జాబితాకు సంబంధించిన క్లెయిమ్స్ అబ్జెక్షన్స్ (అభ్యంతరాలు) కు బుధవారం కు చివరి గడువు అని తహశీల్దార్ బక్కయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ఏవైనా క్లెయిమ్స్ లేదా అభ్యంత రాలు ఉన్నట్లయితే తమ తమ పరిధిలోని బిఎల్ఓ లను సంప్రదిం చి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని మండల వాసులు వినియోగించుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

## డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరికలు



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రె స్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా సాత్నాల మండలం శక్తి కమిటీ అధ్యక్షులు మెంతం సురేష్, సైద్ పూర్ గ్రామానికి చెందిన బీ జేపీ నాయకులు జాదవ్ దత్తు బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్ కాలనీలో ఉన్న ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరా రు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాద వ్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నా యకులు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమా లకు ఆకర్షితుల య్యామని తెలిపారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో డా. నరేష్ జాదవ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజ లకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో విశ్వాసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి ప నిచేసే ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని తెలిపారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరపున అన్ని విధ లుగా అండ గా ఉంటామని, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యక ర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుం దని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో డీసీసీ జనరల్ సెక్ర టరీ డీసీసీ ఆఫీస్ ఇంచార్జి గౌలి సంజీయ్,టౌన్ అధ్యక్షులు కిజార్ పాషా, సాత్నాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కినక బాపూరావు, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడ సందౌలత్ రావు, రాథోడ్ కిషన్, రాదేశ్యం తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న రైతు కాడేలస్మన్న కుటుంబాన్ని పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరపున అండగాఉంటాం
కేసీఆర్ రెండేళ్లలో ముఖ్య మంత్రి అవుతారు
రైతులను కాపాడుకుంటారు
కేటీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు
ప్రజా పాలన కాదు - ప్రజల ప్రాణాలతో ఆడుకునే పాలన
రైతు చనిపోతే కేసీఆర్ ప్రభుత్వం రైతు భీమా అందించింది
కాంగ్రెస్ ప్రభుత్వందాని కిస్తులు కూడా కట్టలేదు



**తలమడుగు, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** తలమడుగు మండల కేంద్రానికి చెందిన రైతు కాడే లస్మన్న పంట దిగుబడి రాదన్న దిగులుతో ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా ఈ విషయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకె ళ్లారు. స్పందించిన కేటీఆర్ రైతు కుటుంబాన్ని కలిసి బీ ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించాలని సూచించారు. మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రైతు కాడే లస్మన్న కుటుంబాన్ని పరామర్శించి బీఆర్ఎస్ పార్టీ అన్ని రకా లుగా అండగా ఉంటుందని ఆధర్యపడొద్దని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు మరణాలు జరగకుండా ఉండేందుకు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకం అమలుచేసి ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే రైతు కుటుం బానికి అండగా రూ. 5 లక్షల రైతుభీమ పథకం అమ లుచేసి రైతు కుటుంబాలకు అండగా నిలబడ్డారన్నారు. మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సకాలంలో రైతుబంధు అందించకపోవడం, యూరియా కొరత వలన రైతులు మళ్ళీ తీవ్ర ఇబ్బందులు పడి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని మళ్ళీ 2 సంవత్సరాల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని రైతులను కచ్చితంగా కాపాడుకుంటారని అన్నారు. ప్రభుత్వం రైతుభీమ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాజ్యోతి కథనంతో వైద్యశాఖలో కదలిక!

**మంచిర్యాలరూరల్ అక్టోబర్ 06(ప్రజాజ్యోతి)**గర్భిణుల ప్రాణాల పై ప్రశ్నలు లేవనెత్తుతూ ప్రజాజ్యోతి దినపత్రికలో ఈ నెల 5న" గర్భిణీల ప్రాణాలు గాలిలోనా"అనే కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ స్పందించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని ప్రతిభా నర్సింగ్ హోం,శ్రీనివాస నర్సింగ్ హోంలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతిభా నర్సింగ్ హోంలో ఆపరేషన్ థియేటర్‌తో పాటు వైద్య సేవలకు సంబంధించిన పలు అంశాలను అధికారులు పరిశీలించారు. ఇటీవల మృతి చెందిన రుచితకు అందించిన వైద్య చికిత్సకు సంబంధించిన రికార్డులను పరిశీలించి చికిత్స అందించిన వైద్యురాలి నుంచి వివరాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు, రోగులకు అందించే చికిత్సకు సంబంధించిన ఖర్చుల వివరాలను స్పష్టంగా డిస్‌ప్లే చేయాలని ఆసుపత్రి యాజమాన్యానికి ఆదేశించారు. అదేవిధంగా శ్రీనివాస నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న ఓ రోగికి అందించిన వైద్య సేవలపై అధికారులు వివరాలు సేకరించారు. రోగి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి రిఫర్ చేసి పంపించినట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యుల వివరాలను డిస్‌ప్లే చేయాలని,ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ సూచించారు.



**--జిల్లా కలెక్టర్‌కు నివేదిక**

ఈసందర్భంగా డీఎంహెచ్ఓ డా. నరేంద్ర రాథోడ్ మాట్లాడుతూ. రుచితకు అందించిన వైద్య చికిత్సకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని తెలిపారు. ఘటనపై కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించినట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.

## సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేసిన అధికారి



**సోనాల, అక్టోబర్ 06 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని గురువారం సాయంత్రం మండల అభివృద్ధి అధికారి రత్నాకర్ రావు హఠాత్తుగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమం మరియు భోజన వసతులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా అధికారి హాస్టల్ వంటగది, స్టోర్ రూమ్, మరియు మరుగుదొడ్లను తనిఖీ చేసి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## " సేవా సంకల్ప్ అభియాన్ " కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు మరియు ఆయాలకు సన్మాన



**తాండూర్ అక్టోబర్ 6 ప్రజాజ్యోతి** నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన, అంకిత భావం సందర్భంగా" సేవా సంకల్ప్ అభియాన్ " కార్యక్రమంలో భాగంగా తాండూరు మండలం అచలాపూర్ గ్రామంలో రాష్ట్రపార్టీ పిలుపుమేరకు మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ సూచన మేరకు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నౌనూరి సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు మరియు ఆయాలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రజా సేవకు ప్రతీకగా జరుగుతున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా... సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా 'అంగన్వాడీ ఉత్సవాలు' ఘనంగా నిర్వహించబడుతున్నాయి. సమాజంలో పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి ఆయన కొనియాడారు. మన దేశ భవిష్యత్తు ఆ దేశ బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది కావున ఆ బాలలకు సరైన పోషకాహారం, ప్రాథమిక విద్యను అందించి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు ఎలా చూసుకుంటారో, కేంద్రానికి వచ్చిన ప్రతి చిన్నారినీ అంతకంటే ఎక్కువగా ప్రేమతో ఆప్యాయతతో చూసుకునే 'అంగన్వాడీ దీదీల' సేవలు వెలకట్టలేనివి అని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బిజెపి మండల ఉపాధ్యక్షులు కొండు రవి, రేవెల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఈర్ల సంతోష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అడ్వాల సతీష్, వార్డు సభ్యులు వరిమడ్ల విజయ్, గంగాధరి శ్రీనివాస్, ఏముర్ల రవి కుమార్, బొగరపు సతీష్, కౌటం రమేష్, ఎల్లెల శ్రీనివాస్, సంగర్తి భాణేష్ ఉపేందర్ జూపాక నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రిమ్స్ అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి

## పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుప త్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, రోగు లకు మెరుగైన వైద్య సేవలు అందేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం రిమ్స్ వైద్య కళాశాలలోని డైరెక్టర్ చాంబర్‌లో వైద్య, ఇంజనీరింగ్, సంబంధిత శాఖల అధికారులతో రిమ్స్ అభివృద్ధి పనులు, మౌలిక వసతులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చేపడుతున్న సివిల్ పనులు విద్యుత్ మరమ్మతులు, ఆక్సిజన్ పైప్ లైన్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్‌లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాల నిరంతర పర్యవేక్షణ, నిర్వహణ కోసం తక్షణమే బయోమెడి కల్ ఇంజనీర్‌ను నియమిం చాలని ఆదేశించారు. రోగులను పరామర్శించేందుకు వచ్చే సహాయకుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డుల విధానాన్ని వెంటనే అమలు చేయాలని రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. పనిచేయని వెంటిలేటర్లను వెంటనే మరమ్మతు చేయించడంతో పాటు, ఆసుపత్రికి అవసర మైన కొత్త వైద్య పరికరాల కొనుగోలు ప్రక్రియను వేగ వంతం చేయాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చే సిన అత్యవసర నిధులను సద్వినియోగం చేసుకుంటూ, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అ ధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వాహణకు అత్యంత ప్రాధా న్యత ఇవ్వాలని, శానిటేషన్ వర్కర్లు, పేషెంట్ కేర్, సెక్యూ రిటీ సిబ్బంది సమయపాల న పాటిస్తూ విధులను బాధ్యతా యుతంగా నిర్వర్తిం చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధులకు సిబ్బంది హాజరు, పనితీరును సంబంధిత అధికారులు నిరంతరం ప ర్యవేక్షించాలని సూచించారు. అలాగే కార్మికులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన 'మీ ప్రమాణం' యాప్ ద్వారా మాత్రమే వేతనాలు చెల్లిం చేలా సంబంధిత గుత్తేదారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మికుల హక్కులు, వేతన చెల్లింపుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యా నికి తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రి పరిస రాలు పరిశుభ్రంగా ఉండేలా, మౌలిక వసతులు మె రుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ పనులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావే శంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ రావు, రిమ్స్ డైరెక్ట ర్ డాక్టర్ జై సింగ్, వివిధ విభాగాల అధి పతులు, ఇంజనీరింగ్ అధి కారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతులు వేగవంతం చేయాలి



జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** జిల్లాలోని పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేసి, సకల సౌకర్యాలతో ఇ ళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధి కారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల పు రోగతి, కాలనీల్లో అవుట్ సైడ్ పెయింటింగ్, అంతర్గత రహదారులు, తాగునీటి స రఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డబుల్ బె డ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇళ్ల బాహ్య సౌందర్యం కోసం నా ణ్యమైన అవుట్‌సైడ్ పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అంతర్గత గ్రావెల్ రోడ్ల నిర్మాణాన్ని వేగ వంతం చేయాలని ఆదేశిం చారు. ప్రతి ఇంటికీ సురక్షిత మైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పైప్‌లైన్ విస్తరణ, నల్లాల ఫిట్టింగ్ తది తర పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించి, అవసరమైన మౌలి క వసతులను ఏర్పాటు చే యాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు పనుల నాణ్య తను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్దేశించిన కాలపరిమితి లోగా అన్ని పనులను పూర్తి చేసి, ఇళ్లను లబ్ధిదారులకు అప్ప గించేందుకు సిద్ధంగా ఉంచాలని, పనుల్లో జాప్యంచో టుచేసుకోకుం డా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు

ఎమ్మెల్యే పాయల శంకర్

పలువురు బిజెపి లో చేరిక



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6, (ప్రజాజ్యోతి)** కేంద్రంలోని బిజెపి ప్రభు త్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయి స్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో బేల మండలంలోని కడ్కి గణేష్‌పూర్ సర్పంచ్ నా గోరావుతో పాటు వార్డు సభ్యులు పలువురు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వా నించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఇండియన్ రెడ్‌క్రాస్ నూతన కా ర్యవర్గం

సమాజ సేవలో మరింత చురుగ్గా పనిచేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యు లు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లోమ ర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎన్ని కల్లో విజయం సాధించి నూతనంగా బాధ్యతలు స్వీక రించిన కార్యవర్గ సభ్యులు, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా లో చేపట్టనున్న వివిధ సేవా కార్యక్రమాల పై కలెక్టర్‌తో చ ర్చించారు. రక్తదాన శిబిరా లు, ఉచిత వైద్య శిబిరాలు, అత్యవసర సమయాల్లో బా ధితులకు సహాయ చర్యలు, ఇతర సామాజిక సేవా కార్య క్రమాలను మరింత విస్తృ తంగా, సమర్థవంతంగాని ర్వహించనున్నట్లు తెలిపా రు. నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్ అభినందించా రు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవల ను మరింత విస్తరించి పేద లు, నిరుపేదలు, బాధితులు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని సూచించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాల ని కో రారు. సమాజ హితం కోసం నూతన కార్యవర్గం అంకితా భావంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్. ఎ స్. చిత్రు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రతినిధులు ఆడే క్రాంతి కుమార్, మనోహర్, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మీడియా అకాడమీ ఛైర్మన్ పర్యటనను విజయవంతం చేయాలి

## వర్కింగ్ జర్నలిస్టుల శిక్షణా తరగతులకు విస్తృత ఏర్పాట్లు



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజాజ్యోతి)** తెలంగాణ మీడియా అకాడ మీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వర్కింగ్ జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణా తరగ తులకు సంబంధించిన ఆహ్వానాన్ని మీడియా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్లకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ ఛైర్మన్ పర్యటనతో పాటు శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, ప్రొటోకాల్ చర్యలపై కలెక్టర్, ఎస్పీలకు వివరించారు. కార్యక్రమం సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసర మైన ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాలోని జర్నలిస్టులు ఈ శిక్షణా కార్యక్రమంలో పా ల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మీడియా ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఇ. వి ష్ణువర్ధన్, మీడియా ప్రతినిధులు దేవేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు, ఏటీఎంలు, గోల్డ్ షాపుల వద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయాలి

జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్



**మంచిర్యాల, 6,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** బ్యాంకులు, ఏటీఎంలు, గోల్డ్ షాపుల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం బ్యాంకు అధికారులు, గోల్డ్ షాపుల యజమానులతో పోలీసులు సమావేశంను నిర్వహించి పలు భద్రతా సూచనలు చేశారు. బ్యాంకులు, ఏటీఎంలు, గోల్డ్ షాపుల వద్ద తప్పనిసరిగా తగిన సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ సూచించారు. ప్రతి గోల్డ్ షాప్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి పనితీరును ఎప్పటి కప్పుడు పరిశీలించాలని తెలిపారు. బ్యాంకుల వద్ద అనుమానిత వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గోల్డ్ షాపులు, బ్యాంకుల వద్ద ప్రజలను ఏమార్చి దొంగతనాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను గమనిస్తూ, అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పనుల నిమిత్తం వచ్చే వ్యక్తుల వివరాలను సేకరించి పోలీసులకు అందజేయడంతో పాటు వారి నడవడికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఏటీఎంల వద్ద బ్యాంకు అధికారులు సెక్యూరిటీని ఏర్పాటు చేయడంతో పాటు తగిన లైటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన అలారం సిస్టమ్ సక్రమంగా పనిచేస్తుందో లేదో ఎప్పటికప్పుడు పరీక్షించాలని సూచించారు. ముత్తూట్ గోల్డ్ ఫైనాన్స్, బ్యాంకు గోల్డ్ ఫైనాన్స్, గోల్డ్ షాప్ యజమానులు సరైన ఆధారాలు లేకుండా బంగారాన్ని తాకట్టు తీసుకోవద్దని పోలీసులు స్పష్టం చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా బంగారం తాకట్టు పెట్టేందుకు వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండి భద్రతా చర్యలు పాటిస్తే నేరాలను నియంత్రించవచ్చని పోలీసులు తెలిపారు. గోల్డ్ షాప్ యజమానులు తగిన సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుని తమ పరిధిలో గస్తీ నిర్వహించాలని, బ్యాంకులు కూడా నిర్దేశిత భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.. ఈ సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, పట్టణ ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటా కేటాయించాలి

**శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ఎస్‌సీసీడబ్ల్యుయూ--ఐఎఫ్‌టీయూ ధర్నా**

**జీఎం టి. శ్రీనివాస్‌కు మెమోరండం**




**మంచిర్యాల, 6,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటాను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యుయూ--ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. అనంతరం శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ టి. శ్రీనివాస్‌కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌సీసీడబ్ల్యుయూ--ఐఎఫ్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం మాట్లాడుతూ, గత సంవత్సరం సింగరేణి యాజమాన్యం పర్మినెంట్ కార్మికులకు 34 శాతం లాభాల వాటాను చెల్లించిందని, ఒక్కో కార్మికుడికి రూ.1,96,610 చొప్పున లాభాల వాటా అందించిందని తెలిపారు. అయితే పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.5,500 చెల్లించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించడం వల్లే సింగరేణి యాజమాన్యానికి భారీగా లాభాలు వస్తున్నాయని ఆయన అన్నారు. ఒక పర్మినెంట్ కార్మికుడికి చెల్లించే వేతనంతో సుమారు పది మంది కాంట్రాక్ట్ కార్మికులను పనిచేయించుకుంటున్నారని తెలిపారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల్లో భారీ వ్యత్యాసం ఉందని, ఒక పర్మినెంట్ కార్మికుడి స్థానంలో పది మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. సింగరేణి సంస్థకు వచ్చే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ, చెమట చుక్కలు దాగి ఉన్నాయని బ్రహ్మానందం అన్నారు. సంస్థ లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల పాత్రను గుర్తించి వారికి న్యాయమైన వాటా అందించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటాను కేటాయించాలని ఎస్‌సీసీడబ్ల్యుయూ ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. తిరుపతిరెడ్డి, గజ్జి మల్లేష్, మాడుగుల శంకర్, కొండురుపాక సదానందం, రాజు, గద్దల శంకర్, బాబు, రాజయ్య, తిరుపతి, మహేష్, సంతోష్, శేఖర్, పైడిరాజు, రాజు, రమేష్, వల్లకొండ రాజయ్య, సుధాకర్, రమ, లక్ష్మి, సరోజన, మల్లేశ్వరి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటేయాలి

**భారీ మెజార్టీతో గెలిపించాలి**

**కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి**

**మంచిర్యాల, 6,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** అక్టోబర్ 9న జరగనున్న ఆర్టీసీ ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, ఐఎన్‌టీయూసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పూదరి తిరుపతి లు పిలుపునిచ్చారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు మంచిర్యాల బస్టాండ్‌లో ఆర్టీసీ ఎన్నికల సమావేశంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకత్వాన్ని బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ ఎన్నికల్లో ప్రతి కార్మికుడు తన ఓటు హక్కును వినియోగించుకుని బాణం గుర్తుకు ఓటు వేయాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కా ర్మికుల భవిష్యత్తు, సంక్షే మం కోసం ఐక్యంగా నిల వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో





మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు స్రవంతి-కిషోర్, చింతపండు శ్రీనివాస్, లాగిశెట్టి రాజయ్య, తాళ్ల సంపత్‌రెడ్డి, కర్రె శ్రీనివాస్, రాచకొండ గోపాల్‌రావు, సుధమల్ల హరికృష్ణ, కాకుల వరలక్ష్మి-యువరాజ్, వెల్పుల రవీందర్, జోగుల సదానందం, శ్రీపతి కవిత-వాసు, కో-ఆప్షన్ సభ్యులు కల్వల జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే దయానంద్, సత్తయ్య, సుదర్శన్, నారాయణ, రాంమూర్తి, పలువురు ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.